# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

ఆదివారం | 18 అక్టోబరు, 2026 | పేజీలు : 08


## తాగునీటికే ప్రథమ ప్రాధాన్యత యాసంగిలో వరి వద్దు




**ప్రజాపక్షం/పెద్దపల్లి:** సూపర్ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తాగునీటికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, యాసంగిలో వరి సాగు చేయవద్దని ఉమ్మడి కరీంనగర్ జిల్లాల ప్రత్యేక అధికారి బెన్హర్ మహేష్ దత్ ఎక్కా ఆదేశించారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో శనివారం నాలుగు జిల్లాల కలెక్టర్లు గరీమ అగర్వాల్, సత్యప్రసాద్, కోయ శ్రీహర్ష, చిత్ర మిశ్రాలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గోదావరి,కృష్ణాలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయని, రాష్ట్రంలో 30 లక్షల బోర్లలో 56 లక్షలు పనిచేయడం లేదని, భూగర్భ జలాలు పడిపోతున్నాయన్నారు. యాసంగిలో వరికి బదులు మొక్కజొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలను ప్రోత్సహించాలని, డ్రిప్, స్ప్రింక్లర్లను వాడాలని సూచించారు. పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో 863 మి.మీ వర్షపాతం నమోదై 5% తక్కువగా ఉందని, సుల్తానాబాద్‌లో 33% లోటు ఉందని, ప్రస్తుతం పంటలకు ఇబ్బంది లేదని, ఎల్లంపల్లిలో 18.17 టీఎంసీలు ఉన్నాయని, యాసంగిలో ప్రత్యామ్నాయ పంటలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

# పూలనే పూజించే పండుగ బతుకమ్మ

**ప్రజాపక్షం/జగిత్యాల:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగకు జగిత్యాల జిల్లా ముస్తాబవుతోంది. ప్రకృతిలో సహజంగా లభించే రంగురంగుల పూలనే పూజిస్తూ, ప్రకృతిని ఆరాధించే అపురూపమైన పండుగగా బతుకమ్మకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆడపడుచుల ఆత్మీయతకు, కుటుంబ బంధాలకు, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగ వేడుకలకు జిల్లాలోని పల్లెలు, పట్టణాలు సిద్ధమవుతున్నాయి. నేడు నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ సంబురాలతో ఎటుచూసినా పూల పరిమళాలు,సంప్రదాయ పాటలు,మహిళల కోలాటాలతో పండుగ వాతావరణం నెలకొననుంది.పూలతో పేర్చిన ప్రకృతి సౌందర్యం.. బతుకమ్మబతుకమ్మ అంటేనే బతుకుకు ప్రతీక.. ప్రకృతికి ఆరాధన.. మహిళల మనసుల్లోని ఆనందానికి ప్రతిబింబం. తంగేడు, గునుగు,బంతి, చామంతి,గుమ్మడి పూలు తదితర రకరకాల పూలతో గుండ్రంగా, వరుసలుగా పేర్చిన బతుకమ్మలు ప్రకృతి అందాలకు అద్దం పడతాయి.ప్రకృతిలోని ప్రతి జీవికి, ప్రతి మొక్కకు, ప్రతి పువ్వుకు ఉన్న ప్రాధాన్యాన్ని చాటిచెప్పే ఈ పండుగ పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని కూడా అందిస్తుంది.

**ఆడపడుచుల సందడే.. బతుకమ్మకు అందం :** సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలు, యువతులు సంప్రదాయ వస్త్రధారణలో ముస్తాబై, అందంగా పేర్చిన బతుకమ్మలతో ఒకచోట చేరి వేడుకలను నిర్వహిస్తారు. బతుకమ్మ చుట్టూ వలయాకారంలో నిలబడి చప్పట్లు కొడుతూ సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతారు. తెలంగాణ గ్రామీణ జీవనశైలిని, జానపద కళలను, మహిళల ఐక్యతను ప్రతిబింబించే ఈ వేడుకలు అందరినీ ఆకట్టుకుంటాయి.పుట్టింటికి వచ్చిన ఆడపడుచులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఇరుగుపొరుగు మహిళలు కలిసి బతుకమ్మను పేర్చి, పాటలు పాడుతూ ఆనందంగా గడపడం ఈ పండుగలోని ప్రత్యేకమైన ఆత్మీయతకు నిదర్శనం. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను నేటి తరం యువతులకు పరిచయం చేస్తూ, తెలంగాణ సంస్కృతిని భావితరాలకు అందించే వేదికగా బతుకమ్మ నిలుస్తోంది.

**గౌరమ్మకు పూజలు.. సద్దుల బతుకమ్మకు ప్రత్యేకత :** బతుకమ్మ పండుగలో చివరి రోజైన సద్దుల బతుకమ్మకు విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉంది. మహిళలు భక్తిశ్రద్ధలతో బతుకమ్మలను పేర్చి, గౌరమ్మను కొలుస్తారు. తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, పిల్లలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని ప్రార్థిస్తారు.సద్దుల బతుకమ్మ సందర్భంగా సంప్రదాయబద్ధంగా పులిహోర, నువ్వుల అన్నం, పెరుగన్నం, కొబ్బరి అన్నం తదితర ప్రసాదాలను తయారుచేసి నైవేద్యంగా సమర్పించడం ఆనవాయితీ. గౌరమ్మను భక్తిశ్రద్ధలతో పూజిస్తూ, కుటుంబ సౌభాగ్యాన్ని కోరుకుంటూ మహిళలు బతుకమ్మ సంబురాల్లో పాల్గొననున్నారు.పూలను పూజించే పండుగ.. ప్రకృతిని ఆరాధించే పండుగ.. ఆడపడుచుల ఆత్మీయతను చాటే పండుగ.. అదే మన బతుకమ్మ పండుగ.



### కాయకల్ప్ అవార్డుల్లో
# జిల్లాకు గర్వకారణం



కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం/నస్పూర్ :** కాయకల్ప్ అవార్డ్స్ 2025–26 కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఘన విజయం సాధించిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో టివివిపి వైద్యాధికారులను శాలువాతో సన్మానించి, మొక్కలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రి రన్నరప్‌గా నిలిచి పది లక్షల రూపాయల నగదు బహుమతి గెలుచుకుందని తెలిపారు. చెన్నూరు ఏరియా ఆసుపత్రి, లక్షెట్టిపేట సామాజిక ఆరోగ్య కేంద్రం కమెండేషన్ అవార్డులతో పాటు చెరో లక్ష రూపాయల నగదు బహుమతి సాధించాయని వెల్లడించారు. ఆసుపత్రులలో పారిశుధ్యం, రోగులకు అందుతున్న వైద్య సేవలు, నిర్వహణ ప్రమాణాలు మెరుగుపరచడంలో వైద్యులు, సిబ్బంది చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ పరిశుభ్రమైన వాతావరణాన్ని కొనసాగిస్తూ ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టివివిపి మూడు ఆసుపత్రుల పర్యవేక్షకులు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కార్మికులకు స్వీట్లు పంపిణీ

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబర్ 9 న జరిగిన ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో అధిక డిపోల్లో ఏఐటియుసి కి విజయం చేకూర్చిన సందర్భంగా శనివారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని అన్ని గనులు,ఓసిపి 5, డిపార్ట్మెంట్ ల పై సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆద్వర్యంలో సింగరేణి కార్మికులకు స్వీట్లు పంపిణి చేయడం జరిగిందని ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను లు పేర్కొన్నారు.శనివారం వారు జిడికె 11వ ఇంక్లైన్, జిడికే 2వ ఇంక్లైన్ మరియు ఓసిపి 5 లో జరిగిన స్వీట్స్ పంపిణి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీ లో గుర్తింపు సంఘం ఎన్నికలు రద్దు చేసిందని, ఆర్టీసీ లో కార్మికుల సమస్యల పై యూనియన్ లు మాట్లాడకుండా చేసిందని ఆరోపించారు. గత పది సంవత్సరాలుగా ఆర్టీసీ లో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటియుసి కృషి చేయడం జరిగిందని, ఏఐటియుసి ఆద్వర్యంలో అన్ని కార్మిక సంఘాల ను కలుపుకొని జేఏసీ గా ఏర్పడి ఆర్టీసీ ని ప్రభుత్వం లో విలీనం చేయాలని, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మూడు రోజులు సమ్మె చేసిన మేరకు రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పది సంవత్సరాల తరువాత ఆర్టీసీ లో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించిందని,ఈ ఎన్నికల్లో ఏఐటియుసి అనుబంధ ఎంప్లాయిస్ యూనియన్ 97 డిపోల్లో 80 కి పైగా విజయం సాధించిందని పేర్కొన్నారు. అదేవిధంగా సింగరేణి సంస్థ మనుగడ కొనసాగాలంటే రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కి బాకీ ఉన్న 59 వేల కోట్ల రూపాయలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 13న విద్యుత్ సౌధ ముందు ధర్నా నిర్వహించి అధికారుల కు వినతి పత్రం ఇవ్వడం జరిగిందని,ఈ నెలాఖరులోగా బకాయిలు చెల్లించకుంటె సింగరేణి నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి బొగ్గు, విద్యుత్ సరఫరాను అడ్డుకుంటామని హెచ్చరిక చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఉపాధ్యక్షులు సంకె అశోక్, బోగ సతీష్ బాబు, సహాయ కార్యదర్శి మాదన మహేష్, సిద్దమల్ల రాజు, దొంత సాయన్న,చెప్యాల భాస్కర్, మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, నాయిని శంకర్, గొడిశల నరేశ్,దాసరి శ్రీనివాస్, దాసరి అనిల్, బి.శ్రీరాములు, ఊరడి అంజన్న,తదితరులు పాల్గొన్నారు.



# రైతుల సమస్యలపై 23న కలెక్టరేట్ ఎదుట బిజెపి ధర్నా

**ప్రజాపక్షం/గన్నేరువరం :** రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న కరీంనగర్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట బిజెపి ఆధ్వర్యంలో రైతులతో కలిసి భారీ ధర్నా నిర్వహించనున్నట్లు బిజెపి మండల ఇంఛార్జి సంపెల్లి సంపత్ రావు వెల్లడించారు. శనివారం గన్నేరువరం మండల కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ అసమర్థ పాలన వల్లే నేడు రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటుందని ఆరోపించారు. విద్యుత్ కొరత, సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించిందని రైతులకు జరుగుతున్న ఈ నష్టానికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో నిర్వహించబోయే ఈ ధర్నా కార్యక్రమానికి గన్నేరువరం మండలం నుంచి రైతులు, బిజేపి నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం బిజేపి నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్



నాయకులు ఏలేటి చంద్రారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు బొమ్మాడి సురేందర్ రెడ్డి, పుల్లెల రాము, బిజేవైఎం అధ్యక్షుడు మచ్చ సాయికృష్ణ, నాయకులు పుల్లెల జగన్ మోహన్, లింగయ్య, దానవేణి ప్రశాంత్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బస్సులో యువతికి తీవ్ర అస్వస్థత



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** హైదరాబాద్ నుంచి గోదావరిఖనికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో శనివారం ఒక యువతి అకస్మాత్తుగా తీవ్ర అస్వస్థతకు గురై స్పృహ కోల్పోయింది.తోటి ప్రయాణికుడైన అబ్దుల్ హకీమ్ తక్షణమే స్పందించి ఆమెను ఆసుపత్రికి తరలించడంతో ప్రాణపాయం తప్పింది.వివరాల్లోకి వెళ్తే, హైదరాబాద్ నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు సుల్తానాబాద్ సమీపంలోకి రాగానే, బస్సులో ప్రయాణిస్తున్న ఓ యువతికి అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చి కిందపడిపోయి స్పృహ కోల్పోయింది. దీంతో బస్సులోని ప్రయాణికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు.ఆ సమయంలో అదే బస్సులో ప్రయాణిస్తున్న అబ్దుల్ హకీమ్ వెంటనే స్పందించి,ఏమాత్రం ఆలస్యం చేయకుండా మానవతా దృక్పథంతో యువతిని సుల్తానాబాద్‌లోని సివిల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ఆమెకు తక్షణమే అత్యవసర వైద్య సేవలు అందించడంతో పరిస్థితి విషమించకుండా సురక్షితంగా బయటపడింది.ఆపద సమయంలో చాకచక్యంగా వ్యవహరించి,సకాలంలో వైద్యం అందేలా చూసి తోటి ప్రయాణికురాలి ప్రాణాలను కాపాడిన అబ్దుల్ హకీమ్‌ను స్థానికులు,ఆర్టీసీ సిబ్బంది తో పాటు తోటి ప్రయాణికులు ప్రత్యేకంగా అభినందించారు.

## పెద్దపల్లి బిజెపి ఒబిసి మోర్చా ఉపాధ్యక్షులుగా సదయ్య

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులుగా చిట్టవేణి సదయ్య యాదవ్ నియమితులయ్యారు.ఈ మేరకు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్ గౌడ్,జిల్లా అధ్యక్షుడు కర్రే సంజీవ్ రెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు చాతరాజు రమేష్ ఆధ్వర్యంలో నియామకాన్ని ప్రకటించారు.ఈ సందర్భంగా చిట్టవేణి సదయ్య మాట్లాడుతూ,తనపై నమ్మకం ఉంచి జిల్లా ఉపాధ్యక్ష పదవిని అప్పగించిన పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, ఓబీసీ వర్గాల అభ్యున్నతికి అంకిత భావంతో పనిచేస్తానని పేర్కొన్నారు.తన నియామకానికి సహకరించి ఆశీర్వదించిన ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్ గౌడ్,మాజీ శాసనసభ్యుడు గుజ్జుల రామకృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రే సంజీవ్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శులు కడారి అశోక్ రావు,పల్లె సదానందం, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు చాతరాజు రమేష్, సుల్తానాబాద్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు,పార్టీ నాయకులు,కార్యకర్తలు, మిత్రులందరికీ చిట్టవేణి సదయ్య ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## సద్దుల బతుకమ్మకు సర్వం సిద్ధం

**ప్రజాపక్షం/కరీంనగర్:** తెలంగాణ సంస్కృతిని చాటే... సద్దుల బతుకమ్మను నగర ప్రజలు ప్రశాంత వాతావరణంలో కుటుంబ సమేతంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకోవాని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. కరీంనగర్ నగరపాలక సంస్థ ద్వారా రేపు జరుగబోయే సద్దుల బతుకమ్మ వేడుకలకు సర్వం సిద్ధం చేశామని తెలిపారు. కరీంనగర్ లో శనివారం నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ యాదగిరి సునీల్ రావు, పలువురు కార్పోరేటర్లతో కలిసి కొత్తపల్లి, గార్లకుంట నిమజ్జనం ఘాట్లను సందర్శించి... ఏర్పాట్లను తనిఖీ చేసి పరిశీలించారు. నగరపాలక సంస్థ 3 కోట్ల నిధులను కేటాయించి మొత్తం 28 పాయింట్లలో భారీ ఏర్పాట్లతో పటిష్టమైన వసతి సౌకర్యాలు కల్పించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... నగర



ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా నగరపాలక సంస్థ ద్వారా సద్దుల బతుకమ్మ కు ఘనంగా ఏర్పాట్లు చేశామని తెలిపారు. మొత్తం 28 పాయింట్లను ఏర్పాటు చేసి కావల్సిన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి పాయింట్ వద్ద నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బందికి విధులు కేటాయించామని... సద్దుల బతుకమ్మ వేడుకలో ప్రజలకు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీస్కోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పోరేటర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటోలో మరిచిపోయిన నగదు బ్యాగ్ బాధితురాలికి అందజేత

**ప్రజాపక్షం/కరీంనగర్:** ఆటోలో ప్రయాణిస్తూ పొరపాటున తన హ్యాండ్ బ్యాగ్‌ను మరిచిపోయిన ఓ మహిళకు, పోలీసులు, ఆటో యూనియన్ నాయకుల చొరవతో ఆమె విలువైన వస్తువులు సురక్షితంగా చేరాయి. బాధితురాలి వివరాల ప్రకారం.. అక్టోబర్ 15వ తేదీ రాత్రి 8 గంటల ప్రాంతంలో చెన్నై షాపింగ్ మాల్ వద్ద ఆటో ఎక్కిన మహిళ, విద్యానగర్‌లో దిగారు. అయితే అనుకోకుండా తన హ్యాండ్ బ్యాగ్‌ను ఆటోలోనే మరిచిపోయారు. ఆ బ్యాగులో 8 గ్రాముల బంగారం, రూ. 12,000 నగదు ఉన్నాయి.బాధిత మహిళ వెంటనే కరీంనగర్ ఆటో కార్మిక నాయకులను సంప్రదించి విషయం తెలిపారు. స్పందించిన యూనియన్ నాయకులు వెంటనే అప్రమత్తమై పోలీసుల సహకారంతో ఆటోను, డ్రైవర్‌ను గుర్తించారు. టూ టౌన్ సీఐ సృజన్ రెడ్డి, ఎస్సై శ్రీకాంత్, హెడ్ కానిస్టేబుల్ ఆధ్వర్యంలో బాధితురాలికి ఆ బ్యాగును భద్రంగా అందజేశారు. ఈ



సత్కార్యానికి సహకరించిన ఆటో డ్రైవర్ ఆవుదుర్తి బాబును అందరూ అభినందించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బండారు సంపత్ పటేల్, ఉపాధ్యక్షులు కొత్తూరు సత్యనారాయణ, ఇరవేణి కుమార్, సహాయ కార్యదర్శి వాల్క రమేష్, ఈసీ మెంబర్ కురుమాచలం వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు. బాధితురాలు పోలీసులకు, ఆటో యూనియన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## కరెన్సీ నోట్లతో కాళరాత్రిదేవి అవతారం

**ప్రజాపక్షం/కరీంనగర్:** దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 7వ రోజైన శనివారం శ్రీ మహాశక్తి ఆలయంలో శ్రీ మహాలక్ష్మి దేవి (కాళరాత్రి) అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కరెన్సీతో నిజ పాద దర్శన రూపంలో ప్రత్యేకంగా అలంకరించిన శ్రీ మహాలక్ష్మి దేవిని చూసిన భక్తులు పరవశించిపోయారు. వేలాది మంది భక్తుల రాకతో మహాశక్తి ఆలయం కిటకిటలాడుతోంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



ఈరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు పూజలు నిర్వహించడంతోపాలు అమ్మవారి సేవలో తరించారు. ఆలయానికి వచ్చిన భక్తులను కలుసుకుంటూ వారితో ముచ్చటించారు. క సాయంత్రం 6 గంటలకు శ్రీ లక్ష్మి సాహస్ర పారాయణం విన్పించారు. అనంతరం బ్రహ్మశ్రీ గర్రెపల్లి మహేశ్వర శర్మ పండితులు''శ్రీ భాగవత వైభవం'' వివరిస్తూ ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు కరీంనగర్ జిల్లా సెషన్స్ జడ్జి ఎస్.శివకుమార్ శ్రీ మహాశక్తి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరోవైపు కాసేపట్లో మహాశక్తి ఆలయంలో దాండియా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు భారీ ఎత్తున భక్తులు తరలివస్తున్నారు. కాళరాత్రి దేవి ఆరాధన కేవలం ఆచారాలకు పరిమితం కాదు. మనలోని భయం, అహంకారం, చెడు ఆలోచనలను జయించి సత్యం, ధర్మం, న్యాయం వైపు నడవాలని ఈ అవతారం గుర్తుచేస్తుంది. కష్టాలను చూసి వెనుకడుగు వేయకుండా ధైర్యంగా ముందుకు సాగాలనే స్ఫూర్తిని అందిస్తుంది. చీకటిని తొలగించి వెలుగును నింపే శక్తిగా, భయాన్ని తొలగించి అభయమిచ్చే తల్లిగా కాళరాత్రి దేవి భక్తుల పూజలందుకోవడం విశేషం.



## గ్రామ పంచాయతీ సిబ్బందికి దుస్తుల పంపిణీ



**ప్రజాపక్షం/గన్నేరువరం:** గన్నేరువరం మండలంలోని సాంబయ్యపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ గడ్డం రమ్యఉదయరెడ్డి, ఉప సర్పంచ్ జీల రాజవ్వతో కలిసి గ్రామ పంచాయతీ సిబ్బందికి బతుకమ్మ, విజయదశమి పండుగ సందర్భంగా దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ పండుగను కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామ సర్పంచ్‌తోపాటు ఉప సర్పంచ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూకల రమణ, అనిల్ రెడ్డి, జీల మహేశ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అక్రమ పేలుడు పదార్థాలు స్వాధీనం

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు జిల్లాలోని సైదాపూర్ మండలం సోమారం గ్రామ శివారులో వ్యవసాయ బావి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతంలో దాడి నిర్వహించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ తనిఖీల్లో అక్రమ పేలుడు పదార్థాలు కలిగి ఉన్నట్లు గుర్తించి రామడుగు మండలం శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన వేముల భూమయ్య (45)ను అదుపులోకి తీసుకున్నారు.అతని వద్ద నుంచి 475 జిలెటిన్ స్టిక్స్, సుమారు 3 వేల మీటర్ల డిటోనేటింగ్ వైర్ (3 బండిళ్లు), రెండు కంప్రెసర్ ట్రాక్టర్లు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలు, కంప్రెసర్ ట్రాక్టర్లను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం సైదాపూర్ పోలీసులకు అప్పగించారు.

## సద్దుల బతుకమ్మ, ఫ్యామిలీ డే వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/రామగిరి:** సింగరేణి రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా ఆధ్వర్యంలో ఆదివారం 18వ తేదీన నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ, ఫ్యామిలీ డే వేడుకలకు సంబంధించి తగిన ఏర్పాట్లను చేయాలని రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ అన్నారు.శనివారం ఆయన సెంటినరీ కాలనీలోని రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో సంబంధిత విభాగాలు చేస్తున్న ఏర్పాట్లను,అలాగే బొక్కల వాగు వద్ద ఏర్పాటు చేస్తున్న బతుకమ్మ ఘాట్ ను పరిశీలించి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం నాడు సాయంత్రం 6 గంటల నుండి సద్దుల బతుకమ్మ, ఫ్యామిలీ డే వేడుకలను నిర్వహించబడునని, ఈ వేడుకల్లో భాగంగా బతుకమ్మ ఆట పాటలు నిర్వహించడం కోసం తగిన ఏర్పాట్లు చేయడంమే కాకుండా ఉత్తమంగా తీర్చిదిద్దిన బతుకమ్మలను ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రోత్సాహక బహుమతులు ప్రధానం చేయబడునని అన్నారు. ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులు, కాలనీ మహిళలు అధిక సంఖ్యలో బతుకమ్మలతో విచ్చేసి ఈ వేడుకలను జయప్రదం చేయవలసిందిగా కోరారు.ఈ వేడుకల్లో హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లను చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.వారితోపాటు గుర్తింపు,ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్ర రెడ్డి,బెల్లం శ్రీనివాస్,ఎస్వోటుజిఎం యం.రామ్మోహన్, సివిల్ డిజియం ఎస్.రవికుమార్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం,ఇతర అధికారులు,సిబ్బంది,తదితరులు ఉన్నారు.

## తుర్కకాశ తెలంగాణ స్టేట్ లెవెల్ క్రికెట్ టోర్నమెంట్

**ప్రజాపక్షం/వేములవాడ టౌన్:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో శనివారం నిజామాబాద్ గ్రామంలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో నాంపల్లి ( ఇస్లాం నగర్) టీమ్ మరియు నల్గొండ జిల్లా బి టీమ్ తలపడగా, ఇస్లాంనగర్ టీమ్ 8 ఓవర్ లో 74/1 పరుగుల చేయగా, నల్గొండ బి టీమ్ 8 ఓవర్ లో 66/8 రన్స్ చేసింది. 8 పరుగుల తేడాతో విజయం సాధించిన నాంపల్లి ఇస్లాంనగర్ టీమ్‌ని గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

# రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ఎల్‌నినో కరువుతో అల్లాడుతున్న రైతులకు భరోసాగా సాదిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజాయాత్ర చేపట్టినట్లు చైర్మన్, హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీ తెలిపారు.అక్టోబర్ 12న ప్రారంభమైన యాత్ర జనగామ,సిద్దిపేట,సిరిసిల్ల, నిజామాబాద్ మీదుగా శనివారం పెద్దపల్లికి చేరుకుంది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు హక్కుల రక్షణ,భూ హక్కుల పరిరక్షణ, అసైన్డ్ భూములకు పూర్తి హక్కులు, విద్యారంగానికి బడ్జెట్‌లో 20% కేటాయింపు,కులగణనలో బీసీ పదం చేర్పు, భూ భారతి సమస్యలను గ్రామసభల ద్వారా పరిష్కారం, కరువు నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా డిమాండ్‌కు ప్రజా మద్దతు కూడగడుతున్నామన్నారు.రైతు పంటలు ఎండిపోతున్నా జిల్లా కలెక్టర్లు గ్రామాలు తిరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.సిద్దిపేటలోని లెనిన్ గ్రామం, నిజామాబాద్ సిర్నాపల్లి తండాల్లో, పెద్దపల్లి జిల్లా శ్రీరాంపూర్ మండలం ఈదులాపూర్‌లో పంటలు ఎండిపోవడాన్ని తాము చూశామన్నారు.ఈ కార్యక్రమంలో భూరక్షణ సమితి అధ్యక్షుడు గుమ్మడి కొమురయ్య,కే. రాజు,ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## తుదిశ్వాస వరకూ ముత్తారం ప్రజల సేవలోనే ఉంటానని స్పష్టీకరణ

**ప్రజాపక్షం/ముత్తారం:** తుదిశ్వాస వరకు ముత్తారం ప్రజల సేవలోనే ఉంటానని మాజీ జెడ్పిటిసి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగినేని జగన్మోహన్ రావు స్పష్టం చేశారు. .పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలో శనివారం పలు కుటుంబాలను పరామర్శించిన అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ జెడ్పీటీసీ నాగినేని జగన్మోహన్ రావు మాట్లాడుతూఎప్పటికీ ముత్తారం మండలాన్ని, ఇక్కడి ప్రజలను మరచిపోలేనని, నిరుపేదల సేవే పరమావధిగా తన జీవితాన్ని అంకితం చేస్తున్నట్లు తెలిపారు.తను ఎప్పటికీ ముత్తారం మండలాన్ని మరచిపోనని,తుదిశ్వాస వరకు ప్రజలకు సేవలు కొనసాగిస్తానని ఆయన స్పష్టం చేశారు.

## దావన్నపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా



**ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్:** దావన్నపల్లి గ్రామం ఐకమత్యానికి నిలువెత్తు ప్రతీక అని,రానున్నది బీసీల రాజ్యమేనని,ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూ ప్రశ్నించే గొంతుకగా ఎల్లప్పుడూ మీ ముందుండి నిలబడతానని ఏఐఎఫ్‌బీ జిల్లా కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్ ఉద్ఘాటించారు.తనపై అపారమైన నమ్మకంతో ఇంతటి ప్రేమాభిమానాలను కురిపిస్తున్న దావన్నపల్లి గ్రామాన్ని జిల్లాలోనే అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని,అభివృద్ధి దిశగా తనతో కలిసి నడవాలని ఆయన గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు.శనివారం గ్రామానికి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు,కీలక నాయకులు,గ్రామస్తులు ముక్తకంఠంతో కొలిపాక శ్రీనివాస్ నాయకత్వానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.రానున్న 2028 శాసనసభ ఎన్నికల్లో కొలిపాక శ్రీనన్నను ఎమ్మెల్యేగా గెలిపించుకోవడమే లక్ష్యంగా,గ్రామం మొత్తం ఆయన వెంటే నిలుస్తుందని స్పష్టం చేస్తూ భారీ ఎత్తున ఏఐఎఫ్‌బీ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక వార్డు సభ్యులు ఆసంపల్లి రామ్మోహన్,లక్ష్మి రమేష్,దొడ్ల రిషితసతీష్,సర్పంచ్ అభ్యర్థి దొడ్ల రామకృష్ణ,దావన్నపల్లి ఆలయ చైర్మన్ మద్దెల మల్లయ్యలతో పాటు గ్రామ పెద్దమనుషులు,యువకులు,మహిళలు కొలిపాక శ్రీనివాస్ సమక్షంలో పార్టీలో చేరారు.గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి,ప్రజా సంక్షేమానికి శ్రీనివాస్ నాయకత్వమే సరైన మార్గమని ఈ సందర్భంగా చేరిన నాయకులు స్పష్టం చేశారు.

## రైతుల విద్యుత్, సాగునీటి సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** రైతులకు నిరంతర విద్యుత్, ఎస్సారెస్పీ కాలువల ద్వారా సకాలంలో సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శనివారం రాఘవపూర్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు.బీజేపీ రాష్ట్ర, కిసాన్ మోర్చా జిల్లా శాఖల పిలుపు మేరకు వివిధ గ్రామాల రైతులు పాల్గొని ప్లకార్డులు ప్రదర్శించారు.తరచూ విద్యుత్ కోతలతో మోటార్లు కాలిపోతున్నాయని, పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సారెస్పీ నీటిని ముందుగా విడుదల చేసి ఉంటే పంట నష్టం జరిగేది కాదన్నారు.కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కట్కూరి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ రైతులకు నిరంతర విద్యుత్ ఇవ్వాలన్నారు. రాష్ట్ర నాయకుడు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో తూకం పేరుతో మోసం జరగకుండా చూడాలని, రైస్ మిల్లులపై తనిఖీలు చేయాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శివంగారి సతీష్, యువమోర్చా అధ్యక్షుడు రామగిరి అఖిల్, కందుల శ్రీనివాస్, అంజి, తదితరులు పాల్గొన్నారు.

## రైతులను తప్పుదోవ పట్టించి అయోమయానికి గురిచేస్తున్న బిఆర్ఎస్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఎల్‌నినో ప్రభావంతో పంట మార్పిడి చేయాలని రైతులకు అవగాహన కల్పిస్తే బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాజకీయంగా లబ్ధి పొందడానికి రైతులను తప్పుదోవ పట్టించి అయోమయానికి గురి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు సూర దేవరాజు అన్నారు. శనివారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించి బిఆర్ఎస్ నాయకులు సమావేశంలో మాట్లాడిన మాటలను ఖండించారు. 2014–15లో వచ్చిన మాదిరిగానే ఇప్పుడు కూడా ఎల్‌నినో ప్రభావం రావడంతో రైతులు నష్టపోవద్దనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రత్యామ్నాయ పంట వేసుకోవాలని ఆలోయన చేయాలని ఎల్‌నినో ప్రభావం వల్ల నీళ్ల కష్టాలు వస్తాయని ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఆనాడు రైతులకు అవగాహన కల్పించకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయి మానసికంగా కుంగిపోయి పంట కోసం తీసుకున్న అప్పులు తీర్చలేక 2014లో 898 మంది రైతులు, 2015లో 1358 మంది రైతులు ప్రాణాలను తీసుకున్నారని అన్నారు. మీ ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ముందు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే రైతులు తమ ప్రాణాలను తీసుకున్నారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఆకునూరి బాలరాజు, సిరిసిల్ల పట్టణ ఉపాధ్యక్షులు బొప్ప దేవయ్య, ప్రధాన కార్యదర్శి గాజుల నరేశ్, పత్తిపాక లక్ష్మి రాజు, వెంగళ అశోక్, రాగుల జగన్, బూర యాదగిరి, ఇప్పపూల లక్ష్మణ్, వంగరి అనిల్, గాజుల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద నివారణకు ప్రథమ చికిత్సే ప్రాణరక్షణ



**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** రోడ్డు ప్ర మాదాలు, ఇతర ఆకస్మిక ఘటనల్లో గాయపడిన వారిని సకాలంలో సీటీ, ఎమ్మారై, అల్ట్రాసౌండ్ స్కాన్ వంటి సౌకర్యాలు అన్ని విభాగాల వైద్యులు అందుబాటులో ఉన్న ఆసుపత్రికి వెళ్తే గోల్డెన్ అవర్‌లోనే చికిత్స అందించి ప్రాణాలను కాపాడవచ్చని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్యులు పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత ఇబ్బంది పడడం మానేసి ప్రమాదం జరగకుండా నివారణ చర్యలు తీసుకోవడమే మేలని సూచించారు. వరల్డ్ ట్రామా డే సందర్భంగా శనివారం మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తూ నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ ప్రమాదాలు, ఆకస్మిక ఘటనల కారణంగా శరీరానికి కలిగే తీవ్రమైన గాయాలను ట్రామాగా పరిగణిస్తారని తెలిపారు. తల, మెదడు, అంతర్గత రక్తస్రావం లేదా అవయవాలకు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. ఆలస్యం చేయకుండా వైద్య సహాయం పొందడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రమాదం జరిగిన తర్వాత బాధితులని సురక్షితగా వేగంగా ఆసుపత్రికి చేర్చగలిగితే వెంటనే శ్వాస, రక్త ప్రసరణ, స్పృహ వంటి కీలక అంశాలను పరిశీలించి అవసరాన్ని బటంటి న్యూరోసర్జన్లు, వాసుక్యులర్ సర్జన్, సర్జికల్ గ్యాస్ట్రో, జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్ సర్జన్, రేడియోలజీ, క్రిటికల్ కేర్, అనెస్థిషియా వైద్యుల సమన్వయంతో ప్రాణాలను కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తారని తెలిపారు. మెడికవర్‌లో అన్ని సూపర్ స్పెషాలిటీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యుడు డా.సత్యనారాయణ, న్యూరో సర్జన్ డా.రాజీవ్ రెడ్డి, వాస్క్యులర్ సర్జన్ డా.రవికుమార్, సర్జికల్ గ్యాస్ట్రో వైద్యుడు డా.దిలీప్ రెడ్డి, ఆర్థోపెడిక్ సర్జన్ డా.వేణుగోపాల్, క్రిటికల్ కేర్ వైద్యుడు డా.ఉపేందర్ రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, దాసరి చంద్రశేఖర్, ఈశ్వర్, సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సద్దుల బతుకమ్మ వేడుకల వేళ వెలుగులు

**ప్రజాపక్షం/ముత్తారం :** ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం కేశనపల్లి గ్రామంలో సద్దుల బతుకమ్మ పండుగ వేడుకల సందర్భంగా మిడిల్ పోల్ లైన్‌ను ఏర్పాటు చేశారు.గ్రామంలోని జంగపెల్లి లక్ష్మయ్య ఇంటి నుండి చెరువుకట్ట వరకు ఈ కొత్త విద్యుత్ లైన్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు,మాజీ జెడ్పిటిసి చొప్పరి సదానందం,సర్పంచ్ పెగడ తిరుమల కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మ వేడుకల వేళ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా,లైటింగ్ సౌకర్యం కోసం మంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని ఈ లైన్‌ను మంజూరు చేయించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చొప్పరి సదానందం,సర్పంచులు పేగడ తిరుమల కుమార్, రాపెల్లి రాజయ్య, శ్రీనివాస్, సదయ్య, వార్డు సభ్యులు గుట్ల ఓంకార్, గుట్ల శంకర్, కలవచెర్ల మల్లయ్య, బుర్ర రవీందర్,పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ ఆయుష్ మిషన్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

### జిల్లా ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్. జి. ఎన్.అరుణ

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి జిల్లాలో జాతీయ ఆయుష్ మిషన్ కార్యక్రమం కింద ఆయుష్ పబ్లిక్ హెల్త్ ప్రోగ్రామ్‌లను నిర్వహించడానికి, తెలంగాణ సికింద్రాబాద్ ఆయుష్ శాఖ డైరెక్టర్ పరిపాలనా నియంత్రణలో పనిచేయుటకు అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ కేటగిరీల పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ జి.ఎన్. అరుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఖాళీలు, వేతనం, అర్హతల వివరాలు : ఆయుష్ మెడికల్ ఆఫీసర్ 03 పోస్టులు వేతనం: రూ. 40,000/ (నెలకు)అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ, బోర్డు నుండి ఆయుర్వేద, యునాని, హోమియోపతి, నేచురోపతి విధానంలో కనీసం 4 సంవత్సరాల క్రమబద్ధమైన విద్య నభ్యసించి,1 సంవత్సరం విధిగా ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన డిగ్రీ కలిగి ఉండాలి. ఫార్మాసిస్ట్ (01) పోస్ట్ వేతనం: రూ. 15,000 నెలకు అర్హత డి.ఫార్మసీ , బి.ఫార్మసీ, ఫార్మాడి ఉత్తీర్ణులై ఉండాలని, తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్‌లో తప్పనిసరిగా రిజిస్టర్ అయి ఉండాలి.సైకోసోషల్ కౌన్సెలర్ (01) పోస్ట్ , వేతనం: రూ. 500/ (ప్రతి సెషన్‌కు / సంవత్సరానికి కనీసం 200 విజిట్స్), అర్హత: మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ (MSW) పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. యోగా ప్రొఫెషనల్ (01) పోస్ట్ ,వేతనం: రూ. 28,000/ (నెలకు), అర్హత: కనీసం 4 సంవత్సరాల క్రమబద్ధమైన విద్యతో పాటు 1 సంవత్సరం కంపల్సరీ ఇంటర్న్‌షిప్‌తో కూడిన నేచురోపతి డిగ్రీ, గుర్తింపు పొందిన యూనివర్సిటీ/ బోర్డు నుండి డిప్లొమా ఇన్ నేచురోపతి అండ్ యోగిక్ సైన్సెస్ పూర్తి చేసి ఉండాలని సూచించారు. అభ్యర్థుల వయస్సు 18 నుండి 44 సంవత్సరాల మధ్య ఉండాలి. (ఎస్సీ, ఎస్టీ, బిసి, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, ఎక్స్‌సర్వీస్‌మెన్ అభ్యర్థులకు 3 సంవత్సరాల వయోసడలింపు ఉంటుంది. దరఖాస్తు ఫారమ్, పూర్తి సూచనలను https://www.peddapalli.telangana.gov.inపెద్దపల్లి జిల్లా అధికారిక వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దరఖాస్తు రుసుము రూ. 300/ డిమాండ్ డ్రాఫ్ట్ (DD SBI A/C No: 45472549072)ను GOVT. HOMOEO DISPENSARY DHARMARAM పేరున తీసి దరఖాస్తుకు జతపరచాలి. నింపిన దరఖాస్తు ఫారమ్‌లను అవసరమైన సర్టిఫికెట్ల సెల్ఫ్‌అటెస్టెడ్ జిరాక్స్ కాపీలతో సహా అక్టోబర్ 22,నుంచి 27 వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు పెద్దపల్లిలోని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో నేరుగా గానీ, రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా సమర్పించవచ్చని. గడువు దాటిన తర్వాత వచ్చే దరఖాస్తులు తిరస్కరించబడతాయని తెలిపారు.10వ తరగతి ,ఇంటర్మీడియట్ సర్టిఫికెట్, అర్హత పరీక్ష పాస్ సర్టిఫికెట్ అన్ని సంవత్సరాల మార్క్స్ మెమోలు, బోర్డ్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (మెడికల్ ఆఫీసర్లకు)తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఫార్మాసిస్ట్ పోస్టుకు)తహశీల్దార్ జారీ చేసిన కుల ధృవీకరణ పత్రం, 4వ తరగతి నుండి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు (ప్రైవేట్ అభ్యర్థులకు రెసిడెన్స్ సర్టిఫికెట్), దివ్యాంగులు (PH) సర్టిఫికెట్ ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా అభ్యర్థులకు సంబంధిత సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో అక్నాలెడ్జ్‌మెంట్ కార్డ్. అర్హత పరీక్షల్లో సాధించిన మార్కులు, వెయిటేజీ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని, మెరిట్ జాబితాను జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో ప్రచురించడం జరుగుతుందని జిల్లా ఆయుష్ నోడల్ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఎంపి నిధులతో మంజూరైన హైమాస్ లైట్ ప్రారంభోత్సవం



**ప్రజాపక్షం/బీర్‌పూర్ :** జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలోని కొల్వాయి గ్రామంలో నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అరవింద్ ధర్మపురి నిధుల ద్వారా మంజూరైన హైమాస్ లైట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్. బోగ శ్రావణి పాల్గొన్నారు. ఈ హైమాస్ట్ లైట్‌ను గ్రామ ఉపసర్పంచ్ జక్కుల నాగరాజు ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్. బోగ శ్రావణి మా ట్లాడుతూ,గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు,ప్రజల అవసరాలను తీర్చడానికి ఎంపీ అరవింద్ ధర్మపురి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. హైమాస్ లైట్ల ఏర్పాటు వల్ల గ్రామంలోని ప్రధాన కూడళ్లు, రహదారుల వద్ద రాత్రివేళ వెలుతురు అందడంతో ప్రజలకు సౌకర్యం కలగడమే కాకుండా, రాకపోకలకు మరియు ప్రజల భద్రతకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి నిధులను ప్రజా అవసరాలకు వినియోగిస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని ఆమె అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో బీజేపీ ఎల్లప్పుడూ ముందుంటుందని, గ్రా మాల సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీర్పూర్ మండల అధ్యక్షులు అడెపు నర్సయ్య, జిల్లా కార్యదర్శి పాత రమేష్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు నారపాక అశోక్,శ్రీపతి రమేష్,స్థానిక ప్రజాప్రతినిధులు,బీజేపీ నాయకులు, కార్యకర్తలు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## గాజుల అలంకరణలో కొలువుదీరిన వాసవి అమ్మవారు



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణంలోని శ్రీ వాసవి దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారికి గాజుల అలంకరణతో పాటు సువర్ణ పుష్పార్చన, విశేష ఫల నివేదన కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.గాజుల అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వడంతో ఆలయంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబు–సంతోషిని, బాశెట్టి హరీష్–స్రవంతి, అరిగెల శివకుమార్–భూలక్ష్మి , చింతల కుమార్–చంద్రకళ దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో వాసవి దేవాలయ అధ్యక్షుడు చాడ సురేష్, పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి ఎల్మి రవికుమార్, కోశాధికారి దొంతుల లక్ష్మీ నారాయణ, చిట్టిమిల్లి శ్రీనివాస్, జొన్న శ్రీనివాస్, నరేంద్రుల రవికుమార్‌తో పాటు ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు,మహిళలు,భక్తులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని శ్రీ లక్ష్మీ నరసింహా కాలనీ వద్ద జాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మామిడి రామన్న (58) దుర్మరణం చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం. ధర్మపురికి చెందిన మామిడి రామన్న శనివారం ఉదయం సమయంలో శ్రీ లక్ష్మీ నరసింహ కాలనీ వద్ద రోడ్డు దాటుతుండగా, ధర్మపురి వైపు వెళ్తున్న ఆటోరిక్షా (TG 18 T 0874) అతడిని బలంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో రామన్న తీవ్రంగా గా య పడి సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. దండేపల్లికి చెందిన అవునూరి రాజశేఖర్ (28) ఆటో నడుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యం,అజాగ్రత్త కారణంగానే ప్రమాదం జరిగినట్లు పేర్కొన్నారు.ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు తెలిపారు.

# ప్రతి రోజు వాకింగ్ తో మెరుగైన ఆరోగ్యం



**ప్రజాపక్షం/జగిత్యాల :** ప్రతి రోజు వాకింగ్ తో మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పేర్కొన్నారు.జగిత్యాల ధరూర్ క్యాంప్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి జగిత్యాల శాసనసభ్యులు సంజయ్ కుమార్ హాజరై నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల పట్టణంలోని వాకర్స్ సంక్షేమానికి ఎల్లప్పుడూ కృషి చేస్తూ ఉంటానని అన్నారు. SKNR వివేకానంద మినీ స్టేడియం,ధరూర్ క్యాంప్ గ్రౌండ్‌లో వాకర్స్‌కు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. వాకర్స్ సౌలభ్యం కోసం ఇప్పటికే ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని, జగిత్యాల పట్టణంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం తరఫున నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు.ప్రభుత్వంతో సమన్వయంతో పనిచేస్తూ జగిత్యాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కొందరు రాజకీయ నాయకులు కావాలనే తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, తన జీవితం తెరిచిన పుస్తకమని అన్నారు. జగిత్యాల ప్రజలు తన పనితీరును గుర్తించి రెండవసారి ఎమ్మెల్యేగా గెలిపించారని తెలిపారు. ప్రజల సహకారంతో పట్టణ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని అన్నారు.జగిత్యాల మెడికల్ కాలేజీ చుట్టూ రహదారుల అభివృద్ధి చేపట్టడం ద్వారా పట్టణం మరింత సుందరంగా మారుతుందని తెలిపారు. రామాలయం నుంచి కట్కీర్ రోడ్డు వరకు రూ.1 కోటి నిధులతో డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని అన్నారు.ఆరోగ్యంగా ఉంటేనే జీవితంలో ఎన్నో సాధించగలమని, ఆరోగ్యానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. వాకింగ్‌తో ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.రామాలయం ట్రాక్ అభివృద్ధికి కూడా తనవంతుగా కృషి చేస్తానని, మొదటగా వాకర్స్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాక్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో kdcc జిల్లా మెంబర్ ముప్పాళ్ళ రామచందర్ రావు, కౌన్సిలర్ ప్రశాంత్ రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నర్సయ్య,వాకర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు గాడి పెల్లి చంద్రశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి దేవసపల్లి సత్యనారాయణ,తదితరులు ఉన్నారు.

## దసరా ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట భద్రత కల్పించాలి




**ప్రజాపక్షం/పెగడపల్లి :** దుర్గా నవరాత్రి ఉత్సవాలు, విజయదశమి పండుగ ప్రజలందరూ ప్రశాంతంగా జరుపుకునేలా పోలీస్ అధికారులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశించారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించే క్రమంలో శనివారం ఆయన పెగడపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు,పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ,బీట్ వ్యవస్థ అమలు తదితర అంశాలను ఎస్పీ సమీక్షించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిరంతరం నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. అలాగే స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి,ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు.

మండపాల వద్ద అప్రమత్తంగా ఉండాలి : ప్రస్తుతం జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ, మండపాల వద్ద రక్షణ చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు.

**గస్తీ ముమ్మరం చేయాలి :** నేరాల నియంత్రణలో భాగంగా విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా ఉంచాలని ఎస్పీ స్పష్టం చేశారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేసి చోరీలు, గంజాయి అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలన్నారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి న్యాయం చేయాలన్నారు. ఈ తనిఖీల్లో ఎస్పీ వెంట పెగడపల్లి ఎస్.ఐ కుమార స్వామి పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## కుటుంబానికి గల్ఫ్ సమితి ఆర్థిక భరోసా

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** గత నెల 26వ తారీఖున గల్ఫ్ దేశమైన ఖతార్ లో అనారోగ్యంతో మృతి చెందిన తలారి ముత్తన్న కుటుంబానికి తెలంగాణ గల్ఫ్ సమితి ఆర్థిక భరోసా ఇస్తూ అండగా నిలిచింది.గల్ఫ్ సేవాసమితి ఆధ్వర్యంలో 1,20,000 నగదును జమచేసి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం కింద నడి కూడా,రాఘవపేట, గ్రామాల సర్పంచులు తోట శ్రీనివాస్, తూర్పు సమత రాజన్న చేతుల మీదుగా శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు తోట శ్రీనివాస్, తూర్పు సమత రాజన్న,నాయకులు బైరి రవికుమార్ , శ్రీనివాస్, శంకర్, నారాయణ,రాజ్కుమార్,నరేష్,తదితరులున్నారు.

## చెట్టు ఎక్కిన కోతులు నిప్పు పెట్టిన దుండగులు

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** ఇటీవలే కాలంలో కోతుల బెడదలతో రైతులు సామాన్య ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. కానీ పంట పొలాల్లో ఉన్న కోతులు ఓ తాడి చెట్టు పై ఉండడం గమనించినా మానవత్వం లేని ఓ ప్రబుద్ధుడు చెట్టు కింద నిప్పు పెట్టడంతో నోరులేని వానరాలు ఊపిరాడక కొట్టుమిట్టాడుతూ మృతి చెందిన ఘటన చిట్టాపూర్ గ్రామంలో జరిగింది. చిట్టాపూర్ గ్రామంలోని చెరువు ప్రాంతంలో కోతులను గమనించిన గుర్తుతెలియని దుండగులు నిప్పు పెట్టడంతో తాటి చెట్టు పైనే ఒకటి రెండు ఊపిరాడక మరణించగా, మిగతా వానరాలు గాయాలతో సోమసిల్లి చెట్ల పొదల్లో పడిపోయి మృతి చెందాయి. దీనిని గమనించిన గ్రామస్తులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను ఆరా తీశారు.

## ఇందిరమ్మ ఇళ్ల వెరిఫికేషన్‌కు జిపి సిబ్బంది సొంత వాహన సదుపాయమా..?

ప్రభుత్వ విధివిధానాలపై ప్రశ్నలు..!

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో క్షేత్రస్థాయి పరిశీలనల నిర్వహణపై జగిత్యాల మండలంలో ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన వెరిఫికేషన్ కోసం గ్రామాల్లో పర్యటించే ఓ హౌసింగ్ అధికారికి గ్రామ పంచాయతీ సిబ్బందే డ్రాపింగ్, పికప్ సదుపాయం కల్పిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

ఐదు గ్రామాలే ఉన్నా.. ఇదేనా విధానం..? జగిత్యాల అర్బన్ మండల పరిధిలో ఐదు గ్రామాలు మాత్రమే ఉండటంతో, ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, లబ్ధిదారుల వివరాలు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించేందుకు సంబంధిత ఓ హౌసింగ్ అధికారి పర్యటించాల్సి ఉంటుంది.ఈ ప్రక్రియలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించడం ఎంత ముఖ్యమో, ఆ పర్యటనలు నిబంధనలకు అనుగుణంగా జరగడం కూడా అంతే ముఖ్యం. ఆ పర్యటనల సమయంలో అధికారిని గ్రామానికి తీసుకెళ్లడం, తిరిగి తీసుకురావడం వంటి బాధ్యతలను ఆయా గ్రామ పంచాయతీ సిబ్బంది నిర్వహిస్తున్నారనే ప్రచారం జగిత్యాల అర్బన్ మండలంలో జరుగుతోంది.

పంచాయతీ సిబ్బందిపై అదనపు బాధ్యతల భారం..? గ్రామ పంచాయతీ సిబ్బంది ఇప్పటికే పారిశుధ్యం, తాగునీటి సరఫరా, గ్రామ పరిపాలన, ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించిన వివిధ పనులతో నిత్యం బిజీగా ఉంటారు.ఇలాంటి పరిస్థితుల్లో ఇతర శాఖల అధికారుల రాకపోకల కోసం కూడా వారే వాహన సదుపాయం కల్పించాల్సి వస్తే, అది వారి విధుల్లో భాగమా..? లేక తాత్కాలిక ఏర్పాటా..? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అధికారుల పర్యటనల సమయంలో పంచాయతీ సిబ్బంది సొంత వాహనాన్ని ఏర్పాటు చేస్తున్నట్లయితే సంబంధిత ఆ హౌసింగ్ అధికారిపై జిల్లా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

# అమ్మవారి మంటపాలలో అన్నదానాలు



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** నవరాత్రి ఉత్సవాల పుర స్కరించుకొని అన్ని గ్రామాలలో అమ్మవారి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుపుతున్నారు.ఈ మేరకు నడి కూడా గ్రామంలోని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ,కు స్తా పూర్ గ్రామ నవనిర్మాణ సేవాసమితి ఆధ్వర్యంలో అమ్మ వారి మండపాల వద్ద మహాన్నదాన కార్యక్రమాన్ని జరిపి ంచారు. కుస్తాపూర్ గ్రామంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ప్లాస్టిక్ నిషేధిస్తూ,ఆకులతో ఏర్పాటు చేసిన విస్తార్లు ,పేపర్ గ్లాసులను భక్తులకు అందజేసి ఆదర్శంగా నిలిచారు.ఈ కార్యక్రమాలలో నడి కూడా సర్పంచు తూర్పు సమత రాజన్న, ఉప సర్పంచ్ మారుతి,కుస్తాపూర్ సర్పంచ్ జెల్ల రాజేశ్వర్,ఉప సర్పంచ్ సరి కేల మహిపాల్,ఇరు గ్రామాల గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు భవానీ దీక్ష స్వాములు మహిళా భక్తురాలు పాల్గొన్నారు.

# సాంకేతికతతో సాగు లాభసాటి

ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు



**ప్రజాపక్షం / కాగజ్ నగర్:** ఆధునిక సాంకేతికతతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. శనివారం కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో పది లక్షల రూపాయల వ్యయంతో కొనుగోలు చేసిన వ్యవసాయ డ్రోన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామ సమీపంలోని వరి, కంది పంటలపై డ్రోన్ ద్వారా పురుగుమందుల పిచికారీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అవలంబిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. డ్రోన్ సహాయంతో రోజుకు ముప్పై ఎకరాల వరకు మందులు పిచికారీ చేయవచ్చని, ఎకరానికి మూడు వందల నుంచి నాలుగు వందల రూపాయల ఖర్చు మాత్రమే అవుతుందని వివరించారు. కూలీల కొరత తీవ్రంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో డ్రోన్ల వినియోగం రైతులకు ఎంతగానో మేలు చేస్తుందని పేర్కొన్నారు. సర్పంచ్ అగ్గిళ్ళ సంగీత శ్రీనివాస్, పిఏసిఎస్ చైర్మన్ ఉమామహేశ్వరరావు, డైరెక్టర్లు ధరణి రమేష్, నానాజీ, తిరుపతి, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, ఏడిఏ మనోహర్, మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, ఏఇఒలు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు



**ప్రజాపక్షం / మంచిర్యాల:** ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు డిమాండ్ చేశారు. శనివారం మంచిర్యాల కలెక్టర్ కార్యాలయం ఎదుట ఐదో రోజుకు చేరిన ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమ్మెకు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ కుమార్ తో కలిసి ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా దివాకర్ రావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆరోగ్య శాఖలోని కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో సులభంగా క్రమబద్ధీకరించవచ్చని చెప్పి, అధికారంలోకి వచ్చాక ఉద్యోగులను పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వెంటనే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, న్యాయమైన డిమాండ్ల సాధన వరకు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరాలో సర్కార్ విఫలం




**ప్రజాపక్షం/జన్నారం :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో విద్యుత్ కోతలు పెరిగిపోయాయని, రైతులకు నిరంతర విద్యుత్ అందించడంలో విఫలమైందని జన్నారం మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు రాజారామ్ రెడ్డి విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో ఖానాపూర్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ ఆదేశాల మేరకు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రాజారామ్ రెడ్డి మాట్లాడుతూ సరైన సమయానికి విద్యుత్ అందక పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడిందని, పెట్టుబడులు పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందించిన విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, కొనుగోళ్లు, సరఫరా అంతరాయాలపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అధికారులపై నెపం నెట్టకుండా ఇచ్చిన హామీ మేరకు రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సులువ జనార్దన్, నాయకులు చేటుపల్లి సత్యం, చీటిమల్ల భరత్ కుమార్, మునవర్ అలీ, జాడి గంగాధర్, బోర్లకుంట ప్రభుదాస్, ఫాజల్ ఖాన్, నర్స గౌడ్, రాములు నాయక్, ప్రేమ్ సింగ్, లక్ష్మీ నారాయణ, జంగం రవి తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి ప్రతీక

**ప్రజాపక్షం / మందమర్రి :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక అని మందమర్రి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ అన్నారు. శనివారం స్థానిక జిఎం కార్యాలయంలో మహిళా ఉద్యోగుల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మల చుట్టూ మహిళలు సంప్రదాయ దుస్తుల్లో ఆడుతూ పాడుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా జిఎం రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రకృతిని ఆరాధిస్తూ, మహిళా శక్తిని గౌరవిస్తూ సమాజంలో ఐక్యతను చాటి చెప్పే గొప్ప పండుగ బతుకమ్మ అని తెలిపారు. తరతరాలుగా వస్తున్న ఈ సంస్కృతిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు సంప్రదాయ పండుగలను సమష్టిగా జరుపుకోవడం సంస్థలో స్నేహభావాన్ని, పరస్పర సహకారాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. సేవా అధ్యక్షురాలు ఎన్.శ్రీవాణి రాధాకృష్ణ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, ఆత్మీయతకు నిదర్శనమని చెప్పారు. ఈ వేడుకల్లో ఎస్ఓటు జిఎం జి.ఎల్.ప్రసాద్, శాంతిఖని ఏజెంట్ సంతోష్ కుమార్, డిజిఎం పర్సనల్ సిహెచ్ అశోక్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ వెంకటేశ్వర్ రెడ్డి, సీనియర్ పిఒ సత్యనారాయణ, జిఎం సేఫ్టీ లక్ష్మీ రఘుకుమార్, వాసవి, పద్మప్రియ, ఏఐటియుసి ఫిట్ సెక్రటరీ సిహెచ్ సృజనగీతిక, ఏఐటియుసి అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ టి.జ్యోతి, లేడీస్ క్లబ్ సభ్యులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

అదనపు కలెక్టర్ చంద్రయ్య



**ప్రజాపక్షం / హాజీపూర్ :** గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన హాజీపూర్ మండలంలోని రాపల్లి, హాజీపూర్, కర్ణమామిడి గ్రామ పంచాయతీల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఫామ్ పాండ్స్, ఇంకుడు గుంతలు, బోర్ వెల్ రీఛార్జ్ పాయింట్లు, బతుకమ్మ ఘాట్‌లు, పారిశుద్ధ్య పనులతో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి అధికారులతో సమీక్షించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో మండల పంచాయతీ అధికారి ఎ.సుమన్, ఏపిఒ మల్లయ్య, సర్పంచులు రాంరెడ్డి, మాధవరావు శ్రీలత, బొడ్డు భూమయ్య, పంచాయతీ కార్యదర్శులు రఘు, శ్రీలత, శ్వేత, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి రూ.44 వేల ఆర్థిక సాయం



**ప్రజాపక్షం /పెంచికల్‌పేట్ :** అనారోగ్యంతో మృతి చెందిన పాలే కిరణ్ కుటుంబానికి గ్రామపెద్దలు, మిత్రులు అండగా నిలిచారు. శనివారం మండలంలోని ఎల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలో కిరణ్ దినకర్మ నిర్వహణ కోసం సమకూర్చిన 44 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని ఆయన తల్లి నాగమ్మకు అందజేశారు.గ్రామానికి చెందిన కిరణ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో దాదాపు 20 మంది గ్రామపెద్దలు, స్నేహితులు కలిసి ఈ మొత్తాన్ని పోగు చేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక సాయం అందజేయడం పట్ల స్థానికులు అభినందనలు తెలిపారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు

**ప్రజాపక్షం/కౌటాల :** కౌటాల మండల కేంద్రంలో ఐకెపి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను తీర్చిదిద్ది ఉత్సాహంగా ఆడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా పాటలు పాడుతూ సంబరాలను వైభవంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రమోద్, ఏపిఎం వినేష్ రావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కుసుమ, కార్యదర్శి, కోశాధికారి, సిసిలు, విఒఎలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## నీటి తొట్టెలు, ఇంకుడు గుంతల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/మావల:** వివిజిరామ్‌జి పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో పశువుల తాగునీటి తొట్టెలు, వాటర్ ప్లాంట్ల వద్ద కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా శనివారం అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా అవసరమైన గ్రామాలను గుర్తించి, వెంటనే అంచనాలు సిద్ధం చేసి పరిపాలనా అనుమతులు పొందాలన్నారు. నీటి ఎద్దడి రాకుండా పశువుల తాగునీటి సౌకర్యాలు, భూగర్భ జలాల పునరుద్ధరణ పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.

## ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి

ఎస్ఈఆర్‌డీ సూర్యారావు



**ప్రజాపక్షం/నేరడిగొండ:** నేరడిగొండ మండలం కుమారి గ్రామంలో శనివారం వీబీజీరాంజీ పనులను ఎస్ఈఆర్‌డీ సూర్యారావు, డీఆర్‌డీఓ రవీందర్ పరిశీలించారు. పని కోరిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలని, మస్టర్లలో కూలీల హాజరు పెంచాలని ఆదేశించారు. పని ప్రదేశాల్లో తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లస్మన్న, ఎంపీడీఓ గంగాసాగర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ బస్టాండ్‌లో ‘బేటీ బచావో.. బేటీ పడావో’



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ జిల్లా మహిళా సాధికారత కేంద్రం (డీహెచ్‌ఈడబ్ల్యు) ఆధ్వర్యంలో బేటీ పడావో లో భాగంగా బస్టాండ్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బేటీ బచావో బేటీ పడావో లోగోతో పాటు అత్యవసర సహాయ హెల్ప్‌లైన్ నెంబర్లతో కూడిన హ్యాండిల్స్‌ను బస్సుల్లో ఫిట్ చేయించటం జరిగింది. కార్యక్రమంలో డిపో మేనేజర్ వెంకటరమణ, జిల్లా సంక్షేమాధికారి సౌందర్య, అర్బన్ సీడీపీఓ విజయలక్ష్మీ, డీపో ఎఈ వసుంధర, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ స్వప్న చేతుల మీదుగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా సంక్షేమాధికారి సౌందర్య మాట్లాడుతూ బాలికల రక్షణ, విద్య, మహిళల భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడం, అత్యవసర పరిస్థితుల్లో హెల్ప్‌లైన్ నెంబర్లను వినియోగించుకునేలా ప్రజలను చైతన్యపర్చటం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## గుంజిలిలో ఘనంగా సద్దుల బతుకమ్మ

**ప్రజాపక్షం/మాక్లూర్ :** మండలంలోని గుంజిలి గ్రామంలో శనివారం సద్దుల బతుకమ్మ అంగరంగ వైభవంగా ఎంతో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డిజె సౌండ్‌తో బతుకమ్మలను ఊరేగించారు. మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గ్రామపంచాయతీ సర్పంచ్ గోపి, ఉపసర్పంచ్ సుమన్‌తో పాటు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తగు చర్యలు తీసుకుంటూ ఊరేగించారు. అనంతరం గ్రామంలోని దుర్గామాత మండపం వద్ద బతుకమ్మలను పేర్చి మహిళామణులు ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో సభ్యులు, ఉపసర్పంచ్ సుమన్, సతీష్, కళ్యాణ్, కార్తీక్, రాజు, సాయికుమార్, శ్రీకాంత్, మాలధారణ స్వాములు, సభ్యులు పాల్గొన్నారు.

## అడిషనల్ కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా నూతన అడిషనల్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డి.వెంకట మాధవరావును కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.నిర్మల్ జిల్లా మాజీ డీసీసీ ఉపాధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్, సోన్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు అంబేకర్ ప్రసాద్ కుమార్ ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి,ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రజలకు చేరవేయడంలో అడిషనల్ కలెక్టర్ కీలక పాత్ర పోషించాలని వారు ఆకాంక్షించారు.

## కైలాస్ ఆలయాన్ని దర్శించుకున్న మాజీ ఎంపిపి తుల శ్రీనివాస్



**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండలంలోని నిగిని గ్రామ సమీపంలో గల ప్రసిద్ధ శ్రీ కైలాస్ ్థలాస్ శివాలయాన్ని బోథ్ మాజీ ఎంపీపీ శ్రీ తుల శ్రీనివాస్ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.24 సంవత్సరాల క్రితం లింబ మహారాజ్ కలలో రావడంతో ఇక్కడ అటవీ ప్రాంతంలో గుట్ట పైన భక్తుల సహకారంతో శివాలయాన్ని ప్రారంభించారని తెలిపారు.శాసన సభ్యులు అనిల్ జాదవ్ ఎంపీ తో కలిసి మహారాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి త్వరలోనే రోడ్డునుపూర్తిచేయిస్తానని తెలిపారు.శివయ్యను కోరిన కోరికలుతీరుతాయనిభక్తులనమ్మకమని,శివయ్య అనుగ్రహంతో ప్రజలందరూ సంతోషాలతో ఉండాలనిఆయనకోరుకున్నారు.సర్పంచ్ రూప్చంద్,భక్తులు పాల్గొన్నారు.

## డిప్యూటీ డిఎంహెచ్ఓగా నియమితులైన జాదవ్ వినోద్

**ప్రజాపక్షం/బోథ్ :** డిప్యూటీ డీఎంహెచ్ఓగా నియమితులైన జాదవ్ వినోద్ ని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ ఆయననివాసంలోమర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మల్లెపూల సత్యనారాయణ మాట్లాడుతూ,జాదవ్ వినోద్ తన కృషి, పట్టుదల,అంకితభావంతో ఈ స్థాయికిఎదగడంఅభినందనీయమని పేర్కొన్నారు.నూతన బాధ్యతల్లో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



# రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి

### డిఎంహెచ్ఓ నాగేంద్ర



**ప్రజాపక్షం / కెరమెరి :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి నాగేంద్ర సిబ్బందిని ఆదేశించారు. శనివారం కెరమెరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పిహెచ్‌సి) ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వార్డులు, పరీక్ష గదులు, ప్రయోగశాల, ఫార్మసీ విభాగాలను పరిశీలించి రిజిస్టర్ల నిర్వహణను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటిస్తూ క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో అవసరమైన మందులు, పరికరాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలన్నారు. వార్డులతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. హైరిస్క్ గర్భిణులను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలని తెలిపారు. వ్యాక్సిన్ల నిల్వ, కోల్డ్ చైన్ పరికరాల నిర్వహణలో నిబంధనలు పాటించాలని, అత్యవసర సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూసుకోవాలని ఆదేశించారు. కెరమెరి పిహెచ్‌సి వైద్యాధికారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# బతుకమ్మ ఆడేందుకు అనుమతి ఇవ్వాలి

### ఉప సర్పంచ్ వినయ్



**ప్రజాపక్షం / జన్నారం :** మండలంలోని ఇందన్‌పల్లి గ్రామంలో సర్వే నంబర్ 105లోని ప్రభుత్వ భూమిలో బతుకమ్మ ఆడేందుకు అధికారులు అనుమతి ఇవ్వాలని గ్రామ ఉప సర్పంచ్ చుంచు వినయ్ కోరారు. శనివారం ఆయన గ్రామంలోని ప్రజాప్రతినిధులు, యువకులతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా చుంచు వినయ్ మాట్లాడుతూ గతంలో గ్రామంలోని మహిళలు రోడ్డుపైనే బతుకమ్మ ఆడేవారని, ప్రస్తుతం వారి సంఖ్య పెరగడంతో రోడ్డుపై ఆడటం ప్రమాదకరంగా మారిందని తెలిపారు. మహిళల భద్రతను దృష్టిలో ఉంచుకొని సర్వే నంబర్ 105లోని స్థలాన్ని చదును చేసి సిద్ధం చేయగా అధికారులు అడ్డుకోవడం సరికాదన్నారు. పండుగ వేళ మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కనీసం ఒక్కరోజైనా ఆ భూమిలో బతుకమ్మ ఆడేందుకు అనుమతి ఇవ్వాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మంత్రి హనుమండ్లు, ప్రకాష్, గ్రామ యువకులు పాల్గొన్నారు.

# గిరిజన ఆశ్రమ పాఠశాలలో నీటి వృథా

### దసరా సెలవుల్లోనూ ఆగని మోటార్లు..

### అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు



**ప్రజా పక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో అధికారుల నిర్లక్ష్యం వెలుగుచూసింది. దసరా సెలవుల నేపథ్యంలో హాస్టల్‌లో విద్యార్థులు ఎవరూ లేకపోయినా,వాటర్ ట్యాంక్‌కు నీటిని సరఫరా చేసే మోటార్లు ఆపకపోవడంతో నీరు వృథాగా పోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.వాటర్ ట్యాంక్ పూర్తిగా నిండిపోయి నీళ్లు పొంగిపొర్లుతున్నా మోటార్లను నిలిపివేయకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు ప్రభుత్వ విద్యాసంస్థల్లో విలువైన నీటిని ఇలా వృథా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.సెలవుల సమయంలో పాఠశాల,హాస్టల్‌లో విద్యార్థులు లేనప్పుడు నీటి సరఫరాను పర్యవేక్షించి,అవసరానికి అనుగుణంగా మోటార్లను నిలిపివేయాల్సిన బాధ్యత సంబంధిత సిబ్బందిపై ఉంది. అయినప్పటికీ ఈ విషయాన్ని పట్టించుకోకపోవడం నిర్వహణ లోపాలకు అద్దం పడుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టడంతో పాటు,ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులు,సహజ వనరుల పరిరక్షణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

# ఘనంగా ప్రారంభమైన గంగనీళ్ల మహోత్సవం

**ప్రజాపక్షం/సారంగాపూర్ :** రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ అడెల్లి మహా పోచమ్మ గంగ నీళ్ల జాతర మహోత్సవం శనివారం ఘనంగా ప్రారంభమైంది.ప్రతి సంవత్సరం అమావాస్య తర్వాత దసరాకు ముందు వచ్చే శని ఆదివారాల్లో ఈ జాతర మహోత్సవం కొనసాగుతోంది.

**ప్రత్యేక పూజల అనంతరం :** శనివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో అర్చకులు శ్రీనివాస్ శర్మ ఆలయంలోని శ్రీ మహా పోచమ్మ కు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ ఈవో కే భూమయ్య శోభాయాత్రను ఘనంగా ప్రారంభించారు.

**సాంగ్వి గోదావరికి ప్రయాణం :** అమ్మవారి ఆభరణాలతో అడెల్లి ఆలయం నుండి ప్రారంభమైన ఈ శోభాయాత్ర రాత్రి సమయానికి దిలావర్పూర్ మండలంలోని సాంగ్వి గోదావరి నది తీరానికి చేరుకుంటుంది. పూర్తి పటిష్ట భద్రత మధ్య కాలినడకతో అడెల్లి, సారంగాపూర్,యాకర్పల్లి,వంజర్, ప్యారామూర్,దిలావర్పూర్ మండల కేంద్రంతోపాటు కదిలి,మాటేగాం,కంజర్ గ్రామాల మీదుగా సాంగ్వి గోదావరి నదికి చేరుకుని ఆదివారం ఉదయం పవిత్ర గోదావరి నది జలాలతో ఆభరణాలను శుద్ధి చేసిన అనంతరం అవే గ్రామాల మీదుగా సాయంత్రం అడెల్లి ఆలయానికి చేరుకుంటుంది.

**ప్రత్యేక ఏర్పాట్లు :** ఆదివారం వేల సంఖ్యల్లో తరలివచ్చే బత్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో భూమయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తాగునీరు, విద్యుత్ దీపాలు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మల్, భైంసా డిపోల నుండి బస్సు సౌకర్యం కల్పించారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాలతో ఎస్సై శ్రీకాంత్ ప్రత్యేక బలగాలతో భద్రత ఏర్పాటు చేశారు.





## కుమరం భీమ్ వర్ధంతి ఏర్పాట్ల పరిశీలన



**ప్రజాపక్షం / కెరమెరి :** ఆదివాసీ వీరుడు కుమరం భీమ్ వర్ధంతి కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ అధికారులను ఆదేశించారు. చారిత్రక ప్రాంతమైన జోడేఘాట్‌లో నిర్వహించనున్న వర్ధంతి ఏర్పాట్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి ఆదివాసీలు, ప్రజాప్రతినిధులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున తాగునీరు, పారిశుధ్యం, వాహనాల పార్కింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పోలీస్ అధికారులతో కలిసి భద్రతా ఏర్పాట్లను సమీక్షించి, జనసందోహ నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. వర్ధంతి వేడుకలను ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఐటిడిఎ ఎపిఓ ఆత్రం భాస్కర్, సిఐ వేణుగోపాల్, ఎస్ఐ రాజు, ఎటిడిఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## లోకేశ్వరంలో వైభవంగా కుంకుమార్చన



**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండల కేంద్రంలో మహిళలు దుర్గామాత వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా అర్చకులు అమూల్ పంతులు మాట్లాడుతూ దుర్గాదేవి నవరాత్రుల్లో భాగంగా ప్రత్యేక పూజలు అభిషేకాలు అర్చనలు నిర్వహించడం జరుగుతుందని మహిళలతో కుమార్చన చేయడం జరిగిందని తెలిపారు.మహిళలు సౌభాగ్యంగా ఉండాలని,ఆయురారోగ్యాలతో ఉండాలని ,పాడి పంటలు బాగా పండాలని వ్యాపారాలు వృద్ధి చెందాలని దుర్గాదేవిని ప్రార్థించడం జరిగిందని అలాగే ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు .సర్పంచ్ కపిల్,దుర్గామాత యూత్ సభ్యులు,మహిళలు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## దుర్గామాత మంటపం వద్ద ప్రత్యేక చండీ హోమం

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మంటలంలోని పిప్రి గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గమ్మ మండపం వద్ద శనివారం ప్రత్యేక హోమ క్రతువును నిర్వహించారు.హోమానికి ముందు వేద పండితులు నరసింహస్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి శ్రీ సూక్తం,పురుష సూక్తం,మూల మంత్ర జపాలు నవగ్రహ అర్చనలు నిర్వహించారు.అనంతరం అమ్మవారి శక్తి రూపాలను ఆరాధిస్తూ చండీ పారాయణం చేసి హోమ గుండంలో విశేష ద్రవ్యాలను సమర్పించారు.హోమం ముగింపులో వేద మంత్రాల నడుమ పూర్ణాహుతి భక్తిశ్రద్ధలతో జరిపి, అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు,ఆశీర్వచనాలు అందించారు.తదనంతరం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ అశోక్ భక్తులు,గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మన్మద్ గ్రామంలో ధ్వజస్తంభానికి విరాళం

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** శ్రీరామాలయ మందిరనికి ధ్వజస్తంభం కొరకు క్రి.శే.ఆలూరు మోహన్ రెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు ఆలూరు సాయరెడ్డి,ఆలూరు శేఖర్ రెడ్డిలు 180000 రూపాయలు విరాళం ఇవ్వడం జరిగింది.రామ మందిర ధ్వజస్తంభం కొరకు విరాళం అందివ్వడంతో వారి కుటుంబానికి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బద్దం గంగారెడ్డి బాయమొల్ల సర్పంచ్ లలిత భోజన్న,ఆలయ కమిటీ చైర్మన్ పృథ్వీరాజ్ ,జెట్ల నారాయణ,జుట్టు భూమన్న పాల్గొన్నారు.

# సైబర్ ఆర్థిక మోసాల నివారణ

### ఎస్‌పి జానకి షర్మిల,కలెక్టర్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ ఐడీఓసీలో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా,జిల్లా ఎస్పీ డా. జి.జానకి షర్మిల, ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ, రహదారి భద్రత, ఇసుక అక్రమ రవాణా నివారణ,మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాల నియంత్రణపై చర్చించారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.పట్టణాల్లో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని,వ్యాపార సముదాయాల్లో పార్కింగ్ సదుపాయాలు ఉండేలా చూడాలని సూచించారు. రహదారులపై ఆక్రమణలను తొలగించాలని,పశువులను రోడ్లపై వదిలే యజమానులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి రహదారి భద్రతా చర్యలు చేపట్టాలని,జాతీయ రహదారులపై ప్రమాదకరంగా వాహనాలను నిలిపే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీలు నిబంధనలకు విరుద్ధంగా ఇసుక వేలం నిర్వహిస్తే సహించబోమని,చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.జిల్లాను మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు పోలీస్ శాఖ చర్యలు చేపడుతోందని ఎస్పీ డా.జి.జానకి షర్మిల తెలిపారు.సంబంధిత శాఖల సమన్వయంతో గంజాయి సాగు,విక్రయాలను అరికడుతూ, మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.సమావేశంలో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ ఆర్థిక మోసాల నివారణపై రూపొందించిన ప్రత్యేక పోస్టర్‌ను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, అధికారులు ఆవిష్కరించారు. అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి,అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్,వెంకట మాధవరావు,భైంసా ఏఎస్పీ సాయి కిరణ్,భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు,తహశీల్దార్లు,తదితరులు పాల్గొన్నారు.

## బాస్కెట్ బాల్ క్రీడల్లో ఆర్జీ 3 ఏరియా జట్టు ప్రథమ స్థానం

### కోచ్ గంధం.శీను ప్రోత్సాహంతో

**ప్రజాపక్షం/రామగిరి :** భూపాలపల్లి అంబేద్కర్ స్టేడియం లో సింగరేణి కంపెనీ స్థాయి బాస్కెట్ బాల్,లాన్ టెన్నిస్ క్రీడలు నిర్వహించారు.బాస్కెట్ బాల్ పోటీలలో భూపాలపల్లి ఏరియా జట్టుపై ఆర్జీ3 ఏరియా జట్టు ప్రథమ స్థానంలో గెలుపొందారు లాన్ టెన్నిస్ పోటీలలో వెటరన్స్ విభాగము లో ఓ.సి.పి1 లో టెలిఫోన్ ఆపరేటర్ గా పనిచేయుచున్నా చంద్రశేఖర్ రెడ్డి ద్వితీయ స్థానంలో గెలుపొందారు.బాస్కెట్ బాల్ పోటీలలో ఆర్జీ 3 ఏరియా జట్టు ప్రథమ స్థానం గెలుపొందడానికి క్రీడాకారులకు కోచ్ గంధం. శీను యొక్క శిక్షణ ప్రోత్సాహంతో తో ఆర్జీ3 జట్టు విజయం సాధించింది క్రీడాకారులను గంధం.శీను అభినందించారు.

## దుర్గాదేవి అమ్మవారి సన్నిధిలో అంగరంగ వైభవంగా కుంకుమార్చన



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలో దుర్గాదేవి అమ్మవారికి విశేష అలంకారంలతో కుంకుమార్చన పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.పట్టణంలోని బాగులవాడ శ్రీ ఆంజనేయ దేవాలయంలో గత 46 సంవత్సరాల నుండి అమ్మవారు 1981లో (స్థాపితం) ఆధ్యాత్మిక వేద పండితులు శ్రీమాన్ ఆచార్య కళ్యాణ్ చక్ర వర్తి చే నిర్వహించబడుతు రోజు రోజు ఉంగరంగా వైభవంగా విశేష పూజలు మరియు అలంకరణలతో పూజలు అందుకుంటున్న నవరాత్రి ఉత్సవాలలో పెద్ద ఎత్తున అధిక సంఖ్యలో భక్తులు,మహిళలు పాల్గొని విశేష పూజలు అలంకారములతో అమ్మవారు దర్శనమిస్తున్నారు.పండితులు శ్రీమంత్ ఆచార్య కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుండి నిర్మల్ పట్టణంలో బాగులవాడలో మొట్టమొదటిసారిగా దుర్గాదేవి అమ్మవారిని స్థాపన చేయడం జరిగిందని తెలిపారు.దుర్గాదేవి అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు.అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి వేదమంత్రోచ్ఛరణల మధ్య విశేష పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారికి కుంకుమార్చన సమర్పించారు.భక్తి శ్రద్ధలతో అమ్మవారి నామస్మరణ భజనలు మంగళహారతులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన లో పాల్గొన్న భక్తులు సుఖ సంతోషాలు,ఆయు ఆరోగ్యాలతో కుటుంబ శ్రేయస్సు కలగాలని ప్రార్థించారు.దుర్గాదేవి ఆరాధనలో మరో అంతర్లీన సందేశం శ్రీ శక్తి సృష్టిని నడిపించే శక్తిగా కష్టాలను ఎదుర్కొనే ధైర్యానికి ప్రతిక గా అన్యాయాన్ని ప్రశ్నించే ఆత్మవిశ్వాసానికి ప్రతి రూపంగా అమ్మవారిని భక్తులు భావిస్తారు.ప్రతి మహిళలో అంతర్లీనంగా శక్తి సాహసం ధైర్యం సంకల్పానికి దుర్గామాత రూపం ప్రతీకగా నిలుస్తుంది అమ్మవారి ఆలయంలో జరిగే పూజలు భజనలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తుల్లో ఐక్యత భక్తి భావం సానుకూల ఆలోచన పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం అనంతరం తీర్థప్రసాదాలు ఆలయ నిర్వాహకులు భక్తులకు అందజేశారు.ఇలాంటి అసౌకర్యం కలగకుండా భక్తులకు ఏర్పాట్లు చేశారు.

## పోచమ్మ అమ్మవారి నగల కు స్వాగతం పలికిన పలు గ్రామాల ప్రజలు

### గంగ పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం జాతర



**ప్రజాపక్షం /దిలావర్ పూర్ :** అడెల్లి పోచమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకుని అమ్మవారి నగలను శనివారం అడెల్లి నుండి భక్తిశ్రద్ధలతో సాంగ్వి గ్రామానికి తరలించారు.ముందుగా అడెల్లిలో అమ్మవారి నగలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, వెండి బిందెలలో భద్రపరిచారు.అనంతరం భజ భజన్లీల నడుమ, భారీ పోలీసు బందోబస్తు మధ్య నగల ఊరేగింపు ప్రారంభమైంది. అడెల్లి నుంచి సారంగాపూర్, యాకరపల్లి,వంజర్, ప్యారామూర్,దిలావర్‌పూర్,బన్సపెల్లి, కంజర్ మీదుగా అమ్మవారి నగలు సాంగ్వి గ్రామానికి చేరుకుంటాయి.మార్గమధ్యంలోని గ్రామాల్లో మహిళలు మంగళహారతులతో అమ్మవారి నగలకు ఘన స్వాగతం పలుకుతూ సాగనంపరు.గ్రామ లాల్లో శివసత్తులు, ప్రజలు కాలినడకన,వాహనాల్లో జాతరకు చేరుకున్నారు.సాంగ్వి గ్రామంలోని గంగ పోచమ్మ ఆలయంలో అమ్మవారి నగలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జాతర ప్రారంభం కావడం జరిగింది.అమ్మవారిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, శివసత్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకునారు.జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయం వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు సర్పంచ్ రుక్మవ్వ,ఉపసర్పంచ్ సందీప్ గౌడ్,గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పూంద్రు రమేష్ రెడ్డి తెలిపారు.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పోరాటానికి సంపూర్ణ మద్దతు

### 'ఆప్' రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాముగౌడ్



**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** రాష్ట్రంలోని 78 కేడర్లకు చెందిన నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించి, వారిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన పోరాటానికి ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సంపూర్ణ మద్దతు ప్రకటించింది.ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అవసరమైతే క్షేత్ర స్థాయి పోరాటాలతో పాటు న్యాయస్థానం వరకు వెళ్లి పోరాడేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు.

**ఎన్‌హెచ్‌ఎం జెఏసి ప్రధాన డిమాండ్లు :** ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్,ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ.100 శాతం గ్రాస్ శాలరీ చెల్లింపు మరియు జీఓ 1195 పునః పరిశీలన.ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయడం.ప్రతి నెలా 5వ తేదీలోపు వేతనాలు, వార్షిక ఇంక్రిమెంట్లు,లాయల్టీ బోనస్ విడుదల.

**మహిళా ఉద్యోగులకు 180 రోజుల ప్రసూతి సెలవులు :** విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు 20 లక్షల ఎక్స్‌గ్రేషియా మరియు అర్హులైన కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశం. ఆప్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్,రాష్ట్ర అధికార ప్రతినిధి పరీక్షిత్ రాజ్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు సమీర్ అహ్మద్, రూరల్ అధ్యక్షుడు జుబేర్,నాయకులు దుర్గాప్రసాద్, అవేజ్, ఉమారాణి (సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు),యాది చక్రవర్తి (వనపర్తి), కొడంగల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.ప్రభుత్వం స్పందించి తక్షణమే పరిష్కారం చూపకపోతే ఆందోళనలను తీవ్రతరం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

## సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**ప్రజాపక్షం/బోథ్ :** రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి,వారి కష్టానికి తగిన ప్రతిఫలం అందేలా కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు.రైతులప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సోయాబీన్ కొనుగోలుకేంద్రాన్ని బోథ్ మార్కెట్ యార్డ్లో ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతులు పంట సాగు కోసం పెట్టుబడులు పెట్టి, ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూ పంటను పండిస్తున్నారని పేర్కొన్నారు. పంట చేతికొచ్చిన సమయంలోరైతులుఇబ్బందులు పడకుండా కొనుగోలు కేంద్రాల ద్వారా పంటను సకాలంలో సేకరించేలాచర్యలు తీసుకోవాలని సూచించారు.రైతులకు గిట్టుబాటు ధర లభించేలా, పంట విక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలనిసంబంధితఅధికారులకు సూచించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లె పూల సత్యనారాయణ మాజీ ఆత్మ చైర్మన్ రాజు యాదవ్ కాంగ్రెస్ నాయకులు ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు,రైతులు,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

### నీటి వృథాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/భైంసా :** పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కళ్యాణలక్ష్మి,షాదీముబారక్ పథకాల ద్వారా సాయం అందిస్తోందని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు.కుబీర్ మండలంలోని రైతువేదికలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ పథకాల కింద అర్హులైన 102 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి వృథాను అరికట్టేందుకు గ్రామాల్లో అవసరమైన చర్యలు తీసుకోవాలని సర్పంచులకు సూచించారు.24 గంటల పాటు బోర్లు నడిచే గ్రామాల్లో సమయపాలన విధించి నీటిని పొదుపుగా వినియోగించేలా చూడాలన్నారు.వీబీజీ రామ్‌జీ పథకం ద్వారా పొలాల్లో నీటి కుంటలు, ఇళ్లలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని కోరారు.వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు,ప్రజాప్రతినిధులు,మండల సీనియర్ నాయకులు,కార్యకర్తలు లబ్ధిదారులు,తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

### మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావు పటేల్



**ప్రజాపక్షం/తానూర్ :** మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ తాడేవార్ విఠల్ సోదరుడు, తాడేవార్ లక్ష్మణ్,బోల్సా గ్రామానికి చెందిన పోతన్న సోదరుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.విషయం తెలుసుకున్న ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్,మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణరావు పటేల్,శనివారం వారి నివాసాలకు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి వారికి ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే,శ్యామ్ రావు పటేల్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హెచ్.పుండలిక్,చంద్రకాంత్,గోవింద్ పటేల్,మాజీ సర్పంచ్ రాములు,ఎస్సీ విభాగ్ మండల అధ్యక్షుడు పవార్ సాయినాథ్,ఆత్మ డైరెక్టర్ ఖాదర్ ఖాన్,శెట్టి పటేల్, శివరాం,సత్తార్,విఠల్,కాంగ్రెస్ పార్టీ,నాయకులు,కార్యకర్తలు,పాల్గొన్నారు.

## నిర్మల్‌లో ఘనంగా లక్ష పుష్పార్చన

### పాల్గొన్న ఏలేటి మహేశ్వర్ రెడ్డి దంపతులు!

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలో దసరా నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా ఆధ్యాత్మిక ఈ వాతావరణం ఉట్టిపడింది. బీజేపీ శాసనసభాపక్ష (బీజేఎల్పీ) నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి నేతృత్వంలో అమ్మవారికి 'లక్ష పుష్పార్చన' వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తన సతీమణి కవిత తో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి భక్తిశ్రద్ధలతో లక్ష పుష్పార్చన చేశారు. ఆలయ ప్రాంగణం అమ్మవారి నామస్మరణలు,వేద మంత్రోచ్ఛారణలతో మార్మోగింది. నిర్మల్ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు,అష్టైశ్వర్యాలతో సంతోషంగా ఉండాలని,ప్రాంతం సుభిక్షంగా విలసిల్లాలని కోరుకుంటూ ఈ పూజా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. దసరా నవరాత్రుల వేళ అమ్మవారి దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.పూజా మహోత్సవంలో స్థానిక ప్రజాప్రతినిధులు,బీజేపీ నాయకులు,కార్యకర్తలు,మహిళలు పట్టణ ప్రజలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## పెద్దపల్లిలో దసరా రోజున రావణ దహన కార్యక్రమం

### ఘనంగా బతుకమ్మ ఏర్పాట్లు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** దసరా ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం రోజున పెద్దపల్లి మున్సిపల్ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించే రామ్‌లీలా (రావణ దహనం) ఏర్పాట్లను మరియు పెద్దపల్లి పట్టణంలోని ఎల్లమ్మ గుండమ్మ చెరువు కట్ట వద్ద బతుకమ్మ ఏర్పాట్లను స్థానిక ప్రజాప్రతినిధులతో,మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించి,దసరా రోజున జరిగే రావణ దహన కార్యక్రమానికి ప్రజలందరూ హాజరు కావాలని ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు అన్నారు.అనంతరం పెద్దపల్లి పట్టణ శివారులో (నిమ్మనపల్లి నిట్టూరు రోడ్డు) పెద్దపల్లి రైతులకు మరియు ఎల్లమ్మ గుండమ్మ చెరువు లోకి వెళ్ళే కాలువ తూమును స్థానిక నాయకులతో కలిసి గౌరవ ప్రభుత్వ విప్ విజయరమణ రావు గారు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, కమిషనర్,కౌన్సిలర్లు మరియు సింగిల్ విండో చైర్మన్, పలువురు ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు,మున్సిపల్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## మాడుగుల అశోక్‌కు యువ మేధావుల ఫోరమ్ రాష్ట్ర పగ్గాలు

### ప్రధాన కార్యదర్శిగా మహంకాళి సతీష్‌కు బాధ్యతలు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** తెలంగాణ రాష్ట్ర యువ మేధావుల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడిగా కుందనపల్లి గ్రామానికి చెందిన మాడుగుల అశోక్ నియమితులయ్యారు. జాతీయ కమిటీ నిర్ణయంతో ఆయన నియామక ఉత్తర్వులు వెలువడ్డాయి. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం పోంతుపల్లి గ్రామానికి చెందిన మహంకాళి సతీష్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించనున్నారు.వీరిద్దరూ రెండేళ్ల కాలపరిమితితో పదవుల్లో కొనసాగుతారు. 2007 నుంచి ఫోరమ్ ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న అశోక్,విద్యార్థుల ఫీజుల అంశం, ధరణి పోర్టల్ వల్ల పేదలకు ఎదురవుతున్న సమస్యలు, ఆపరేషన్ కగార్ వంటి అంశాలపై గళమెత్తారు. గతంలో జాతీయ కన్వీనర్‌గా,రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర అధ్యక్ష పదవి కట్టబెట్టారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా □ల్లా మండలం కుందనపల్లికి చెందిన అశోక్ ప్రస్తుతం పెద్దపల్లిలోని టీఎన్‌టీ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు.తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజల హక్కుల పరిరక్షణకు,సమాజ శ్రేయస్సుకు కృషి చేస్తానని, ప్రజా సమస్యలపై పోరాటాన్ని కొనసాగిస్తానని ఆయన పేర్కొన్నారు.త్వరలో మిగిలిన రాష్ట్ర కమిటీని ప్రకటించనున్నట్లు సంస్థ నాయకత్వం తెలిపింది. అశోక్ నియామకంపై ఆయన స్వగ్రామ ప్రజలు,ప్రజా సంఘాల నాయకులు,మేధావులు అభినందనలు తెలియజేశారు.



## వేములవాడ సబ్ స్టేషన్ ఎదుట భగ్గుమన్న బిఆర్ఎస్

### కరెంట్ కోతలపై రైతులతో కలిసి మహా ధర్నా



**ప్రజా పక్షం/వేములవాడ టౌన్:** వేములవాడ పట్టణంలోని చెక్కపల్లి రహదారిలో గల బీసీ హాస్టల్ సమీప సబ్ స్టేషన్ ఎదుట శనివారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి నిరసన ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పాలనలో విపరీతంగా పెరిగిపోయిన విద్యుత్ కోతలు, సాగునీటి కొరత మరియు రైతాంగం ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను నిరసిస్తూ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు స్వయంగా రంగంలోకి దిగి ఈ ఆందోళన నిర్వహించారు.రాష్ట్రంలో నీటి లభ్యత మరియు విద్యుత్ ఉత్పత్తికి అవకాశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం కావాలనే నిర్లక్ష్యం వహిస్తోందని చల్మెడ లక్ష్మీ నరసింహారావు ఆరోపించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద కృష్ణా, గోదావరి జలాల్లో పుష్కలంగా 879 టీఎంసీల నీటి లభ్యత ఉన్నప్పటికీ, కేవలం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఉన్న రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఆ విలువైన నీటిని ఎత్తిపోయకుండా సముద్రం పాలు చేశారని దుయ్యబట్టారు. అంతేకాకుండా రాష్ట్రంలో ఏకంగా 4,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన యాదాద్రి థర్మల్ ప్లాంట్‌తో పాటు భద్రాద్రి థర్మల్ ప్లాంట్లను సక్రమంగా నిర్వహించకుండా మూసివేయడం వల్లే నేడు రాష్ట్రంలో తీవ్రమైన విద్యుత్ కొరత ఏర్పడిందని స్పష్టం చేశారు. చేతికొచ్చిన పంటలు పూర్తిగా ఎండిపోకుండా కాపాడాలంటే ప్రభుత్వం వెంటనే స్పందించి రాబోయే 3 నుంచి 4 వారాల పాటు ప్రతిరోజు నిరంతరాయంగా కనీసం 6 నుంచి 8 గంటల పాటు వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని స్పష్టం చేశారు.రైతుల కష్టాలను పట్టించుకోకుండా ప్రభుత్వం ఇదే రీతిలో వ్యవహరిస్తే బీఆర్ఎస్ పార్టీ ఊరుకోదని, రైతులకు అండగా నిలబడి ప్రజాస్వామ్యబద్ధంగా రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలను, ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ఆడబిడ్డలను ఐక్యం చేసిన బతుకమ్మ సంబురాలు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా కొదురుపాక గ్రామంలో గ్రామ పాలకవర్గ ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.గ్రామంలో మొట్టమొదటిసారిగా గ్రామంలోని మహిళలను ఒక్కచోట చేర్చి వేడుకలు నిర్వహించి ఆప్యాయత,ఐక్యతకు ప్రతీకగా నిలిచారు గ్రామ పాలకవర్గం.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ సట్టు ఉత్తమ కుమారి నాయకత్వంలో విస్తృత ఏర్పాట్లు చేయగా, గ్రామ పాలకవర్గ సభ్యులు సమన్వయంతో ఏర్పాట్లను విజయవంతం చేశారు.బతుకమ్మలను పేర్చి మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నారులు, యువతులు, మహిళలు రంగురంగుల సంప్రదాయ దుస్తుల్లో సందడి చేసి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినందుకు బిజెపి రాష్ట్ర నాయకులు నల్ల మనోహర్ రెడ్డి, భారత రాష్ట్ర సమితి నాయకురాలు మమతారెడ్డి మహిళలతో ఆనందంగా బతుకమ్మ వేడుకలు పాల్గొన్నారు. గ్రామ



మహిళలు సర్పంచ్ సట్టు ఉత్తమ కుమారి, ఉప సర్పంచ్ తిరుపతిరావు, గ్రామ పాలకవర్గ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి ఏడాది ఇదే విధంగా బతుకమ్మ సంబరాలను నిర్వహించాలని వారు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా గ్రామంలో సాంస్కృతిక విలువలను పరిరక్షిస్తూ అందరినీ ఐక్యం చేసే బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తిరుపతి రావు,గ్రామ వార్డు సభ్యులు,మహిళలు పాల్గొన్నారు.

## హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా దుర్గామాత పూజలు

### మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి

**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల :** అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని విద్య, వ్యాపారం, వ్యవసాయం వంటి అన్ని రంగాలలో ప్రజలు వృద్ధి సాధిస్తూ సిరిసిల్ల అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి ఆకాంక్షించారు. సిరిసిల్ల పట్టణంలోని 31వ వార్డులో నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో జిందం కళ చక్రపాణి దుర్గామాతను దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుర్గామాత పూజలు హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అన్నారు. ఆధ్యాత్మిక వాతావరణంలో మండపాన్ని



నిర్వహిస్తున్న నవదుర్గ సేవా సమితి సంఘం సభ్యులను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని ఆధ్యాత్మిక సేవ , సామాజిక కార్యక్రమాల నిర్వహణ ద్వారా నవదుర్గ సేవా సమితి సమాజంలో ఎంతోమందికి ఆదర్శప్రాయంగా నిలవాలని అన్నారు. వార్డు కౌన్సిలర్ సభ్యులు పాశిగంటి రమ్య సత్యనారాయణ, మంచే రేణుక శ్రీనివాస్ కూర భాగ్యలక్ష్మి దేవరాజు, కొండ వర్షిణి నరేశ్, ఊరకొండ లక్ష్మీ రాజు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు వాశికంటి లవన్, శ్రీరామ్ విష్ణు, నవదుర్గ సేవా సమితి మండపం నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

## ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

### ఉద్యోగులకు డాక్టర్ మమతా రెడ్డి సంఘీభావం

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులు తమ న్యాయమైన హక్కులు, సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరసన కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి సంఘీభావం తెలిపారు.శనివారం రోజున ఉద్యోగుల సేవలను ఆమె గుర్తుచేస్తూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వారి పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.ఆరోగ్య రంగంలో ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న ఉద్యోగుల సమస్యలను సంబంధిత అధికారులు, ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని, వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని,వారి హక్కులకు భంగం కలగకుండా చూడాలని డాక్టర్ దాసరి మమతా రెడ్డి గారు సూచించారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లకు తమ సంఘీభావం ఎల్లప్పుడూ ఉంటుందని ఆమె తెలిపారు.వారి వెంట పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్,కో ఆర్డినేటర్ కొయ్యడ సతీష్ గౌడ్, పూదరి చంద్రశేఖర్,బాలసాని శ్రీనివాస్,అడ్వకేట్ శ్యాంబాబు,గడ్డం శ్యామ్,శ్రీనివాస్ జక్కుల శ్రీకాంత్ ఉన్నారు.

## గుడినిర్మాణానికి పునాది వేసింది పుట్టమధే

### మాజీ ఎమ్మెల్యే, దేవాలయ చైర్మన్లకు సన్మానం



**ప్రజాపక్ష/రామగిరి :** నాగేపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి గుడి నిర్మాణానికి పునాది వేసింది మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకరే అని దేవాలయ చైర్మన్ వేగోలపు శ్రీనివాస్ గౌడ్ కొనియాడారు.శనివారం నాగేపల్లి వెంకటేశ్వరస్వామీ దేవాలయం ఆవరణలో నెలకొల్పిన దుర్గాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు.వెంకటేశ్వర ఆలయం ఇక్కడ పురుడుపోసుకున్నదంటే దానికి ప్రధాన కారణం పుట్ట మధూకరే అని కొనియాడారు.ఆయన మొదట రూ.8 లక్షలు మండపం నిర్మాణానికి కేటాయించడంతో గుడి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని,ఆయన స్ఫూర్తితో నిర్మాణం మొదలు పెట్టి బీఆర్ఎస్ హయాంలోనే నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. మాజీ ఎంపీటీసీ వేగోలపు రామాభాను నాయకులు కాపురవేన భాస్కర్, పుల్లెల కిరణ్, బుర్ర శంకర్ గౌడ్, ధర్మల రాజసంపత్, పాశం ఓదెలు, గండి సత్యనారాయణ గౌడ్, ఆసం తిరుపతి, వేగోలపు మల్లన్న,దామెర శ్రీనివాస్, బొంకూరి పోచమ్, కాట అనిల్,మహేందర్,దుద్దిల్ల రాజు,పోలు సంతు,వేగోలపు అనిల్ ,తదితరులు పాల్గొన్నారు.

## దసరా ఉత్సవాలకు ముస్తాబవుతున్న సుల్తానాబాద్



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ మున్సిపల్ పట్టణంలో ఆదివారం జరగనున్న సద్దుల బతుకమ్మ,దసరా ఉత్సవాలను పురస్కరించుకొని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే శ్రీ చింతకుంట విజయ రమణారావు ఆదేశాల మేరకు పట్టణంలోని ఊర పెద్ద చెరువు వద్దతో పాటు వివిధ వార్డులలోని బతుకమ్మ కూడళ్లలో పారిశుద్ధ్య పనులను వేగవంతం చేశారు. ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు మున్సిపల్ కౌన్సిలర్లు,అధికారులు,సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు.మున్సిపల్ చైర్‌పర్సన్ బిరుదు కృష్ణ,కమిషనర్ రమేష్,మున్సిపల్ కౌన్సిలర్లు రాజు,గరిగె శ్రీనివాస్ మున్సిపల్ అధికారులు, పాల్గొన్నారు.

## పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షుడుగా లచ్చన్న

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** నల్లగొండ జిఎం గార్డెన్స్ లో జరిగిన ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్‌టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్, రాష్ట్ర ఆరవ కౌన్సిల్ సమావేశాలలో జరిగిన ఎన్నికలలో రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షుడుగా యుపిఎస్ నారాయణరావు పల్లి జీవశాస్త్ర ఉపాధ్యాయులుగా పని చేస్తున్న పెద్దపల్లి లచ్చన్న ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగింది.ఇందుకుగాను ఎన్నికకు సహరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరున ప్రత్యేకంగా పి ఆర్ టి యు టి ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గండు కృష్ణమూర్తి ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్ లకు జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల రవీందర్,సుల్తానాబాద్ మండల శాఖ అధ్యక్షులు యన్ రెడ్డి మహేశ్వర్, ప్రధాన కార్యదర్శి గాదె కోటేశ్వర్,పలువురు సీనియర్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు.

